
MB
PUBLICATIONS
మధుబాబు

# చైనీస్ మాస్క్


రచన

మధుబాబు



Kinige

© Author
© Madhu Baabu
This digital book is published by -
కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

All rights reserved.

No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.

# చైనీస్ మాస్క్

"లాభం లేదు బేటా! ఆ దొంగనాయాళ్ళు ఇప్పట్లో అక్కడినుంచి కదలరు" ముఖం మీదికి పడుతున్న చింపిరి జుట్టును వెనక్కి నెట్టుకుంటూ అప్పటికి ఆరోసారి అన్నాడు భల్లుదాదా.

ఆ మాటలు తనకు వినబడనట్లే నటించాడు షాడో.

వందగజాల దూరంలో వత్తుగా పెరిగి వున్నాయి కొన్ని కాక్టస్ పొదలు. వాటికి పది అడుగుల దూరంలో మాటువేసి వున్నారు పదిమంది పాకిస్థాన్ సోల్జర్స్. మిషన్ గన్స్‌ని రెడీగా పట్టుకొని బోర్డర్ ఏరియాను అతి జాగ్రత్తగా పరికించి చూస్తున్నారు.

"ఇక్కడ పడిగాపులు పడి వుండటం అనవసరం అని ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోవేమిటి బేటా? రేపు ఇంకొంచెం ముందుగా వచ్చి ప్రయత్నం చేద్దాం..." పట్టువదలని విక్రమార్కుడిలా ఏడోసారి కూడా తీవ్రంగా ట్రై చేశాడు భల్లూదాదా.

అరిగి పోయిన రికార్డులా అతనెందుకు అలా గోల చేస్తున్నాడో షాడోకి తెలుసు.

ఆరోజు ఉదయం పదిగంటలకు ప్రక్క గ్రామంలో వున్న స్నేహితు డొకతను అతి రహస్యంగా భల్లూదాదా దగ్గిరికి వచ్చి పెద్ద తోలుతిత్తి నిండుగా బియ్యపు సారాను బహూకరించి పోయాడు.

పెళ్ళానికి తెలియకుండా ఇంటివెనుక వున్న ఈత పొదల్లో దాచి వచ్చాడు భల్లూదాదా ఆ తోలు తిత్తిని. వచ్చిన మరుక్షణం నుంచి అటువైపే పోతున్నది అతని మనస్సు.

కనురెప్పలు కూడా కదిలించకుండా కాపలా కాస్తున్న సోల్జర్స్ వైపు మరోసారి చూసి, గాఢంగా నిట్టూర్చాడు షాడో.

భల్లూదాదా మాటల్లో అసత్యం వున్నట్లు కనిపించటం లేదు... ఆ రోజుకు తన ప్రయత్నాన్ని విరమించుకోవటం కంటే మరో మార్గం లేదు...

పాంటు జేబులో వున్న పనామా పాకెట్ని బయటికి తీస్తూ, నిశబ్దంగా వెనక్కి జరిగాడతను.

చింపి చేటంత అయింది భల్లూదాదా ముఖం.

"నాకు తెలుసు బేటా... ముసలాళ్ళ మాటలకు విలువ యిచ్చే మనిషివని నాకు ముందే తెలుసు... తెలియబట్టే నీకు సహాయం చేయటానికి మారు మాటాడకుండా వప్పుకున్నాను..." సంబరంగా అంటూ లేచి నిలబడబోయాడు.

మెరుపులా కదిలి, అతని నోటిని గట్టిగా మూశాడు షాడో. భుజాల మీద రెండో చేతిని వేసి బలంగా క్రిందికి అదిమాడు.

కాక్టస్ పొదల వెనుక వున్న సోల్జర్స్లో వున్నట్లుండి చలనం వచ్చింది. మిషన్ గన్స్ని క్రిందపెట్టి స్మార్ట్గా లేచి నిలబడుతున్నారు.

సిగరెట్ కాల్చుకోవాలన్న కోరికను మరిచిపోయి పాములా ముందుకు పాకాడు షాడో. ఎత్తుగా వున్న ఒక చిన్న ఇసుక గుట్టను చాటుచేసుకొని కనులు చిట్లించాడు.

కాక్టస్ పొదలకు అపఫర్లాంగు దూరంలో ఆగి వుంది ఒక మిలటరీ జీప్. ఖరీదయిన యూనిఫాం ధరించి గబగబా అటు వస్తున్నాడు మిలిటరీ కాప్టన్ ఒకతను.

"హర్రి అప్ భల్లూదాదా! ఎదురుచూస్తున్న అవకాశం మన ఎదుటికి రానే వచ్చింది. కమాన్... క్విక్..." పొంగుకు వస్తున్న ఎగ్జయిట్‌మెంట్‌ని అణుచుకోవటానికి ప్రయత్నిస్తూ, హెచ్చరించాడు షాడో.

బియ్యపు సారా సంగతిని మరిచిపోయాడు భల్లూదాదా. తనకు ఎనభై సంవత్సరాలు దాటిపోయాయని కూడా విస్మరించి, పాతిక సంవత్సరాలు మాత్రమే వున్నంత వేగంగా, దూరంలో వున్న పల్లపు ప్రదేశంలోకి పరిగెత్తాడు.

ముందరి కాళ్ళకు బంధాలు వేయటం వల్ల ఫ్రీగా కదలటం చేతకాక సీరియస్‌గా చూస్తూ నిలబడి వున్నాయి అక్కడ అరడజను గార్ధభాలు.

భల్లూదాదా ప్రేమతో పెంచి, పెద్దచేసిన ఒక కుర్ర గార్ధభం కూడా వాటితో బంధింపబడి వుంది. అతన్ని చూడగానే ఎక్కడాలేని సంతోషం ఆవరించుకుంది దాన్ని. తల పైకి ఎత్తి తోకను నిటారుగా గాలిలోకి లేపి చెవులు చిల్లులు పడేటట్లు అరవటానికి ప్రయత్నించింది.

అటువంటి ఎమర్జెన్సీ ఏర్పడవచ్చని ముందుగానే వూహించి దాని మూతిని గట్టిగా బిగించి కట్టేశాడు షాడో. తోకను కూడా కదిలించటానికి వీలులేకుండా గలగలలాడే ఎండు ఈతాకుల కట్ట నొకదాన్ని జారిపోకుండా ఎటాచ్ చేశాడు.

దుస్తుల్లో దాచివుంచిన చిన్న వంకీ కత్తిని బయటికి లాగి ఒకే ఒక దెబ్బతో దాని బంధాలను తెంచి పారేశాడు భల్లూదాదా.

"ముక్కు ముఖం తెలియని పరదేశి నీ కోసం పడివందల రూపాయల్ని నాకు బహుమతిగా యిచ్చాడుబే... అతని కోరికను తీర్చటం నీ విధి... పిచ్చి వేషాలు వేయకుండా ప్లాను ప్రకారం నడుచుకో, " అంటూ అగ్గిపుల్ల నొకదాన్ని వెలిగించి, దాని తోకకు ఎటాచ్ చేయబడిన ఈతాకుల కట్టకు నిప్పు ముట్టించాడు.

గప్పున అంటుకుంది ఆ కట్ట... కనులు మిరుమిట్లు గొలుపుతూ నిలువెత్తుకు లేచాయి మంటలు.

అదిరిపోయింది కుర్ర గార్దభం... అరిచే అవకాశం లేకపోవటంతో దారుణమైన స్థాయికి చేరుకుంది దాని భయం. చెవులు రిక్కించి, కనుగుడ్లను గుండ్రంగా తిప్పుతూ పరుగు ప్రారంభించింది అది... కళ్ళుమూసి తెరిచేటంతలో ఇసుక పర్రను క్రాస్ చేసి కాక్టస్ పొదల్లో దూరి పోయింది.

అది కదిలిన మరుక్షణం, వంకీ కత్తి వ్రేటులతో మిగిలిన గార్దభాలను కూడా బంధాలనుంచి వదిలించాడు భల్లూదాదా. వెనక్కి తిరగకుండా లావుపాటి కర్రముక్క నొకదాన్ని పట్టుకుని ఎడాపెడా వాటి నడుముల మీద బాదాడు.

కుర్ర గార్దభం పోయిన దిశలోనే పరుగులు తీశాయి అవి. కాక్టస్ పొదలకున్న పొడవాటి ముళ్ళు తమ శరీరాలను అంట పీకేసరికి, పిచ్చి పట్టినట్లు ఎగిరి చిందులు తొక్కుతూ, పొదల మధ్య పెద్ద రగడను సృష్టించాయి.

ఊపిరి బిగపట్టి ముంగాళ్ళ మీద కూర్చుని వున్నాడు షాడో. గార్దభాలు కదిలిన మరుక్షణం, పాంటు జేబులో వున్న చిన్న హేండ్ గ్రనేడ్‌ని తీసి బలంగా అటుకేసి విసిరాడు.

నేలకు తగిలీ తగలక ముందే దారుణమైన మ్రోతచేస్తూ బ్రద్దలై పోయిందా గ్రనేడ్. నల్లటి పొగల్ని వెలువరుస్తూ ఊహించిన దానికంటె పదిరెట్లు ఎక్కువ ఎఫెక్ట్‌ని సృష్టించింది.

"మైగాడ్! ఏమరిపాటుగా వున్న అదను చూసి ఇండియన్ బద్మాష్‌లు మన భూభాగంలోకి ప్రవేశించారు. పట్టుకోండి వాళ్ళని. పట్టుకోవటం చేతకాకపోతే నిలువునా కాల్చి చంపేయండి..." ఖంగుమంటున్న కంఠంతో ఆర్డర్ ఇచ్చాడు సోల్జర్స్ దగ్గిరికి వచ్చిన ఆర్మీ కాప్టన్.

అప్పుడప్పుడే అడుగు పెడుతున్న మసక చీకట్ల మూలకంగా షాడో ఆడిన నాటకం సోల్జర్స్‌కి అర్థం కాలేదు. క్రింద పెట్టిన మిషన్ గన్స్‌ని అందుకొని వింటినుంచి వెలువడిన బాణాల్లా పొదల మధ్యకు బయలు దేరారు వాళ్ళందరూ. పొదల్లో చేరి చిందులు తొక్కుతున్న గార్దభాలను బోర్డర్ దాటిన బద్మాష్‌లని అనుకోవటం వాళ్ళు చేసిన పెద్ద బ్లండర్.

పాంటు జేబులో వున్న వాలెట్‌ని తీసి మరికొన్ని కరెన్సీ నోట్లను భల్లూదాదా చేతిలో కుక్కాడు షాడో.

"థేంక్యూ వెరీమచ్ దాదా... నీ సహాయం అపూర్వం. అవకాశం దొరికినప్పుడు తీరికగా వచ్చి కృతజ్ఞతలు తెలుపుకుంటాను. అసలు విషయం తెలుసుకుని ఆ సోల్జర్స్ ఇటువైపు రాకముందే నీ గ్రామానికి వెళ్ళిపో... గో ఆన్," అంటూ అతని సమాధానం కోసం ఎదురు చూడకుండా పాకిస్థాన్ భూభాగంలోకి జంప్ చేశాడు.

# 2

"అటెంక్షన్: అటెంక్షన్ ఎవ్రీ బడీ::" గరగరలాడుతూ యాక్టివేట్ అయింది పీలూ కంటోన్మెంట్ మధ్య భాగంలోవున్న పెద్ద లౌడ్ స్పీకర్.

సరదాగా కబుర్లు చెప్పుకుంటూ ఎవరి పనుల్లో వారున్న సోల్జర్స్ అందరూ అదిరిపడి అటువైపు తలలు తిప్పారు.

ఎమర్జెన్సీ టైమ్స్‌లో తప్ప నోరు విప్పని స్పీకర్ అది.

ఎదురు చూడని విధంగా అది పని చేయటం మొదలుపెట్టిందంటే ఏదో కొంపలు అంటుకునే ప్రమాదం ముంచుకు వచ్చినట్లే లెక్క.

"పుకార్ చెక్‌పోస్ట్ దగ్గిర మన సోల్జర్స్‌ని ఏమార్చి, రొటీన్ చెకప్ కోసం అక్కడికి పోయిన కాప్టన్ కుతుబుద్దీన్‌ని దారుణంగా కొట్టి మన భూభాగం లోకి పారిపోయి వచ్చాడు ఇండియన్ సీక్రెట్ ఏజెంట్ షాడో. కుతుబుద్దీన్ దుస్తుల్ని తను ధరించాడతను. కుతుబుద్దీన్ ఉపయోగించే ఆర్మీ జీప్ లోనే ప్రయాణం చేస్తూ, పుకార్ చెక్‌పోస్ట్ తరువాత వరుసగా వున్న మిదానీ, మాసూమ్, మదీనా సెక్యూరిటీ ఏరియాలను నిరాటంకంగా క్రాస్ చేశాడు... సోల్జర్స్ అందరూ ఎలర్ట్‌గా వుండండి. ఏ క్షణంలో నైనా అతను మన కంటోన్‌మెంట్‌లో అడుగు పెట్టవచ్చు. అనుమానం కలిగిన మరుక్షణం సెంట్రల్ బిల్డింగ్‌కి రిపోర్ట్ చేయండి..." ఖంగు ఖంగున ఎనౌన్స్ చేసి మౌనం వహించింది లౌడ్ స్పీకర్.

"బాప్ రే బాప్! సీక్రెట్ ఏజెంట్ షాడో మన భూభాగంలోకి అడుగు పెట్టాడా? కారణం లేకుండా కదలని ఆ నరరూప రాక్షసుడు పాదాన్ని కదిలించాడంటే మనలో ఎవరికో రోజులు చెల్లిపోయినట్లే... సందేహం ఎంత

## End of Preview.

## Rest of the book can be read @

## http://kinige.com/kbook.php?id=2118

* * *

**Read other books of Madhu Babu @**

http://kinige.com/kbrowse.php?via=author&name=Madhu+babu&id=20